

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

వార్త

# జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

**ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 14 న కోవూరులోని వైకేఆర్‌కె గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళ**

**ఫార్మా, మార్కెటింగ్ మెకానికల్ రంగాల్లో 800 మందికి ఉద్యోగ అవకాశాలు**

**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**



**నెల్లూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త** ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 14 న కోవూరులోని వైకేఆర్‌కె గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్ మేళాను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. ఈ జాబ్ మేళాలో ఫార్మా, మార్కెటింగ్ మెకానికల్ రంగాలకు చెందిన13 కంపెనీలు పాల్గొంటాయని ఆమె ఒక ప్రకటనలో తెలియ చేశారు. దాదాపు 800 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని 10వ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. ఇంటర్వ్యూలో పాల్గొనదలచిన వారు వారియొక్క విద్యార్హతల పత్రాలతో కూడిన రెజ్యూమ్ తీసుకొని రావాలన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే యువతీ యువకులు తమ విద్యార్హత తదితర వివరాలను ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కు చెందిన వెబ్ సైట్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

# సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, ఆగస్టు 13, ప్రభాత వార్త** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి 23088 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో41.954టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 300, ఎన్ఎఫ్‌సికి 340, పెన్నా డెల్టాకు1000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 94.625 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# సారథ్యం పేరుతో రాష్ట్రంలో విస్తృతంగా పర్యటిస్తున్నాను ప్రజల్లో మంచి స్పందన

- హిందూ దేవాలయాలపై దాడులను సహించం
- నామినేటెడ్ పదవుల్లో మా వాటా కోసం ప్రయత్నాలు సాగిస్తాం
- రాష్ట్రం విరివిగా వచ్చే పెట్టుబడులతో గుజరాత్ ను మించి అభివృద్ధిసాధిస్తాం
- 460 కోట్ల సెమీ కండక్టర్ పరిశ్రమ రాష్ట్రానికి గేమ్ చేంజర్
- 1.84 కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమ రాష్ట్ర అభివృద్ధిలో భాగం కానుంది
- పివిఎన్ మాధవ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు



**నెల్లూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త-అగ్రికల్చర్ :** పార్టీ బలోపేతం కోసం సారథ్యం పేరుతో రాష్ట్రమంతటా పర్యటించి నిస్తేజంగా ఉన్న పార్టీని పరుగులు పెట్టించేందుకు కృషి చేస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్. మాధవ్ పేర్కొన్నారు. నెల్లూరులోని బిజెపి జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సారథ్యంలో భాగంగా బిజెపి పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేసుకుంటూ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తున్నానని పివిఎన్. మాధవ్ తెలిపారు. గత నెల 27వ తారీకున కడప నుంచి ప్రారంభమై అన్ని జిల్లాల్లో పర్యటిస్తూ నెల్లూరు జిల్లాకు రావడం జరిగిందన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలతో పార్టీకి వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నానని చెప్పారు. తన పర్యటనలో ప్రముఖ వ్యక్తుల్ని కలవడం, ప్రధాన సమస్యలపై చర్చించి నిర్ణయం తీసుకోవడం, ఆయా ప్రాంతాల్లో ఉన్న మహానుభావుల గురించి పార్టీ కార్యకర్తలకు తెలియజేస్తూ, పార్టీ క్యాడర్ ప్రేరణ పొందేలా కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. ఎక్కడికెళ్లినా పార్టీ కార్యకర్తల్లో, నాయకత్వంలో మంచి స్పందన లభిస్తోందని అన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం శుభపరిణామం అని, 460 కోట్ల రూపాయలతో ఈ పరిశ్రమ రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కాబోతుందని వివరించారు. రాష్ట్రానికి వివిధ అభివృద్ధి పథకాలకు కేంద్రం నుంచి పది లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు రావడం మంచి శుభ పరిణామం అన్నారు. తిరుపతిలో ఎలక్ట్రానిక్ పరిశ్రమ, భోగాపురం, అమరావతిలో ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టులు 1,84,000 కోట్లతో గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమ, విశాఖలో ఆదానీ డేటా సెంటర్, మూలపేట పోర్టు, మచిలీపట్నం పోర్టు, తదితర అభివృద్ధి కార్యక్రమాలతో గుజరాత్ ను దాటి మన రాష్ట్రం అభివృద్ధిని సాధించబోతుందన్నారు. అంతే కాకుండా దుబాయ్ లో సక్సెస్ అయిన లూ లూ కంపెనీ ద్వారా మెగా మాల్స్, ఇంటర్నేషనల్ స్థాయి కన్వెన్షన్ సెంటర్లు వస్తాయని వివరించారు. కూటమి ప్రభుత్వంలో మీర్నుడి నామినేటెడ్ పదవుల్లో మీ పార్టీకి ఎందుకు అన్యాయం చేసుకుంటున్నారని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ, నామినేటెడ్ పదవుల్లో మా పార్టీనే జనసేన పార్టీ, టిడిపి పార్టీలో కూడా కొంత అసంతృప్తి ఉందని వాటన్నిటిని సరి చేసేందుకు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులతో సంప్రదింపులు జరిపామని వెల్లడించారు. నెల్లూరు జిల్లాలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ పదవి సురేష్ రెడ్డికి, తెలుగు సంస్కృతి భాషల పరిరక్షణ చైర్మన్గా ఆర్డీ విల్సన్ కు పదవులు రావడం మంచి పరిణామం అన్నారు. పార్టీలో కార్యకర్తలకు నాయకత్వ లక్షణాలు పెంపొందించి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే విధంగా కార్యకర్తల్లో చైతన్యం తీసుకొస్తున్నామని చెప్పారు. నెల్లూరు ఎయిర్పోర్ట్ విషయంలో కొంత జాప్యం జరుగుతుందని దీనిపై కూడా అధినాయకత్వంతో చర్చిస్తామని చెప్పారు. రాబోయే పరిశ్రమలతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని తెలిపారు. రాష్ట్రంలో 128 దేవాలయాలపై దాడులు జరిగాయని చెప్పారు. కొండ బిట్రగుంట అంతర్వేదిలో గత ప్రభుత్వంలో రథాలు తగలబెట్టినా ఎలాంటి విచారణ చేపట్టకుండా చిన్నచిన్న కారణాలతో జరిగాయి అంటూ, కేసులు మూసి వేయడం జరిగిందన్నారు. వీటిని సహించబోమని హిందూ దేవాలయాల పైన దేవుళ్ళ పైన దాడులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, కర్నాటి ఆంజనేయ రెడ్డి, గుండ్లపల్లి భరత్ కుమార్, వంశీధర్ రెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, దయాకర్ రెడ్డి, విజయలక్ష్మి, సురేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

**- జాయింట్ కలెక్టర్ కార్తీక్**



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 13, ప్రభాతవార్త** బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కే కార్తీక్ రైతు సంఘాలు మరియు ధాన్యం ట్రేడర్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ రైతులు ఈ సంవత్సరం చానా ధాన్యంపై చానా నష్టపోతున్నారని దానిపై రులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందని ఈ సందర్భంగా రైతు సంఘాలు ప్రతిపాదించారు. రైతులను మిల్లర్లు దోపిడీ చేస్తున్నారని మిల్లర్లతో సమావేశం నిర్వహించి రైతులకు చేయాలని ఈ సందర్భంగా తెలియజేశారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నామని ఈ మానిటరింగ్ కమిటీలో జిల్లా అధికారులు, సివిల్ సప్లై, పోలీస్, అగ్రికల్చర్, తదితరులు ఉంటారని ,సందర్భంగా తెలియజేశారు. అలాగే ఈ క్రాప్ సమస్యలు ఉన్నాయని రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి అమల్లోకి తెస్తారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎంఎస్పి కంటే తక్కువ ఎక్కడ కూడా జరగకూడదని మద్దతు ధర కన్నా ఎక్కువ ఉండాలని ఓపెన్ మార్కెట్ నిర్వహించాలని సూచించారు. తొందర్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని విధాలుగా సహకారాలు అందిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# పులివెందులలో ప్రజాస్వామ్యం బతకడాన్ని ఓర్చుకోలేకపోతున్న జగన్ రెడ్డి

**వళ్లు బలిసే చంద్రబాబు నాయుడిపై నోటికొచ్చినట్టు వ్యాఖ్యలు**

**వంగి కొబ్బరికాయ కొట్టలేనటు వంటి వ్యక్తి మా నాయకుడి వయస్సు గురించి మాట్లాడటమా**

**నోరు అదుపులో పెట్టుకోకపోతే జగన్ రెడ్డి అండ్ బ్యాచ్ ఫలితం అనుభవించక తప్పదు**

**నెల్లూరులో మీడియాతో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



**నెల్లూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త-వైద్యం :** పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి వళ్లు బలిసి మాట్లాడుతున్నారు30 ఏళ్ల తర్వాత తొలిసారిగా పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికకు నామినేషన్లు దాఖలు కావడం, పోలింగ్ జరగడంతో ఓర్చుకోలేకపోతున్నారుఇవే చివరి ఎన్నికలు అని, కృష్ణారామ అని జపం చేసుకోవాలని, నరకానికి పోతారని అంటూ చంద్రబాబు నాయుడుపై నోరు పారేసుకుంటున్నారుకుప్పం ఎన్నికల్లో అరాచకంతో గెలిచి ఆ రోజు కూడా చంద్రబాబు నాయుడు గురించి హేళనగా మాట్లాడారురాముడు, కృష్ణుడు జపం చేసుకుంటూ ఇంట్లో కూర్చోలేదు. అనుక్షణం లోకకళ్యాణం కోసం తపించారుచంద్రబాబు నాయుడు కూడా రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల కోసం నిత్యం పోరాటం సాగిస్తున్నారుక్రమశిక్షణ, కష్టపడేతత్వానికి మారుపేరైన చంద్రబాబు నాయుడు పేరెత్తే అర్హత జగన్ రెడ్డికి లేదుజగన్ రెడ్డితో పాటు ఆయన అనుచరుల్లో వళ్లు బలిసిన వారి సంగతి తేల్చే బాధ్యత యువనాయకుడు లోకేష్ బాబు చేపట్టారువైసీపీ పాలనలో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా అరాచకాలు సృష్టించి నామినేషన్లు వేయలేని పరిస్థితి కల్పించారుఇప్పుడు 30 ఏళ్ల తర్వాత పులివెందులలో జెడ్పీటీసీ ఎన్నిక ప్రజాస్వామ్యయుతంగా జరుగుతుంటే ఓర్చుకోలేక ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారువంగి కొబ్బరికాయ కొట్టలేనటువంటి జగన్ రెడ్డి మా నాయకుడు చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడటం బాధగా ఉందిరోజులో 12 గంటలు నిరంతరంగా పనిచేయ గల శక్తి మా చంద్రబాబు నాయుడి సొంతం. నిరంతరం ఆయన ప్రజల కోసమే తపిస్తుంటారు ఇంటర్నేషనల్ స్కామ్ అయిన లిక్కర్ కేసులో సిట్ రోజుకో అంశాన్ని వెలికితీస్తుండటంతో గందరగోళానికి గురవుతున్న జగన్ రెడ్డి నోటిపై అదుపు కోల్పోతున్నారురాజకీయాల్లోకి రావాలంటే నాయన చనిపోవాలి. సీఎం కావాలంటే చిన్నాయన హత్యకు గురవ్వాలి. ఇదీ జగన్మోహన్ రెడ్డి స్టాటజీప్రజా సేవలో ఎంతో అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు బ్యాక్ గ్రౌండ్ ఏమిటి జగన్ రెడ్డి బ్యాక్ గ్రౌండ్ ఏంటిఇకనైనా వళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని జగన్మోహన్ రెడ్డికి హితవు పలుకుతున్నాం. లేదంటే అనుభవించక తప్పదు.

# వివిధ అంశాలపై ప్రిన్సిపల్ సెక్రటరీ, సి.డి.ఎమ్ ఏ ల వీడియో కాన్ఫరెన్స్ సమీక్ష




**నెల్లూరు కార్పొరేషన్, ఆగస్టు 13, ప్రభాతవార్త :** మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్మెంట్ విభాగం ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంపత్ లు వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ కాన్ఫరెన్స్ విభాగం నుంచి నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్, అన్ని విభాగాల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఎల్ఆర్ఎస్, ఎల్ పి ఎస్ పథకాల అమలు, వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలు, వర్షపు నీరు సాఫీగా ప్రవహించేందుకు అవసరమైన కాలువల పూడికతీత పనులు, డ్రైను కాలువలపై అక్రమ నిర్మాణాల తొలగింపు, ఇంటింటి చెత్త సేకరణ, ఆస్థి పన్నుల వసూళ్లు, భవన నిర్మాణాల అనుమతులు, సర్వీస్ లెవెల్ ఇండికేటర్స్, స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర, రెడ్యూస్, రీ యూజ్, రీ సైకిల్ విధానం, డ్రైను కాలువల పూడికతీత, పచ్చదనం పెంపు, పార్కుల ఏర్పాటు తదితర అంశాలపై నెల్లూరు నగర పాలక సంస్థ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వాటర్ టాక్స్, ట్రేడ్ లైసెన్స్, ఖాళీ స్థలముల పన్నులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కనెక్షన్స్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, ఆస్తి పన్నులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వసూలు చేయాలని ఆదేశించారు. టాక్స్ పరిధిలో లేని వాటిని గుర్తించి టాక్స్ పరిధిలో కి తీసుకుని రావలసిందిగా ఆదేశించారు ఈ సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టిపిఆర్ఓ వాసు బాబు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతికార్యకర్తకు భారతీయ జనతా పార్టీలో గౌరవం దక్కేలా కృషి చేస్తా

- ప్రతి గ్రామంలో ప్రతి జిల్లాలో భారతీయ జనతా పార్టీ జెండా ఎగరాలి
- నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయండి
- ఉద్యమాలకు ఊపిరి పోసిన గడ్డ ఎందరో మహనీయులను తయారు చేసిన పురిటిగడ్డ మన నెల్లూరు, నెల్లూరు అంటే నాకెంతో ఇష్టం
- ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల నాయకులు స్పందించండి
- జిల్లాలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల సమస్యలను ఎండగట్టండి తద్వారా పార్టీకి గుర్తింపు తీసుకురండి
- ఎన్నికల్లో గెలవడం ద్వారా ప్రత్యేక గౌరవం లభిస్తుంది అన్ని పదవుల్లో పోటీ చేసేందుకు గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి దాకా కార్యకర్తలు ముందుకు రండి
- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీకే మాధవ్ పిలుపు



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగస్టు 13, ప్రభాతవార్త** భారతీయ జనతా పార్టీని రాష్ట్రంలో ఒక బలమైన పార్టీగా తయారు చేసేందుకు తాను శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీకే మాధవ్ వెల్లడించారు. సారథ్యంలో భాగంగా బుధవారం రోజంతా నెల్లూరులో సుడిగాలి పర్యటన చేసిన పీవీకే మాధవ్ నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కూడా తమ శక్తి మేర కృషి చేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. సారథ్యంలో భాగంగా 12 జిల్లాల్లో పర్యటించి పార్టీ కోసం పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తూ 13వ జిల్లా నెల్లూరుకు వచ్చానని తెలియజేశారు. నెల్లూరు జిల్లాలో చిన్ననాటి నుండి ఏబీవీపీలో పని చేసిన తాను ఈ ప్రాంతంలో జాతీయ వాదం వెల్లివిరిసిన తీరు తనకు ఎంతో నచ్చుతుందని అన్నారు. బీజేపీ జెండా కార్యకర్తలు నాయకులను చూస్తే నాకు సగర్వంగా ఉంటుందని పేర్కొన్నారు. మొదటి సారిగా చట్టసభల్లో బీజేపీ ఎన్నిక కాబడి జైత్ర యాత్ర ప్రారంభించిన గడ్డ నెల్లూరు జిల్లా అని గుర్తు చేసుకున్నారు. 1967లో మొదటి సారిగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మాధవరావు జన సంఘ్ పార్టీ ద్వారా అసెంబ్లీకి వెళ్లారని వెల్లడించారు. ఆ తదుపరి 1978లో ముప్పవరపు వెంకయ్య నాయుడు శాసనసభ్యులు గెలిచి అసెంబ్లీకి వెళ్లిన అద్భుతమైన గడ్డ మన నెల్లూరు అని కొనియాడారు. సారథ్యం గురించి చెప్పాలంటే మన ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో మనం భారతీయులుగా నిలబడిన తరుణం బీజేపీ ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన తరుణం, మనమంతా గర్వపడుతున్నామనే శుభ సందర్భంలో నరేంద్ర మోడీ సారథ్యం అందరికి స్ఫూర్తిదాయకమని గుర్తు చేశారు. రాష్ట్రంలో అన్ని చోట్ల బీజేపీ జెండా రెపరెపలాడేలా చేయడమే, ఈ సారథ్యం పర్యటన ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. తెలుగు వారికొక రాష్ట్రం కోరి 58 రోజుల పాటు ఆమరణ దీక్ష చేసి అశువులు బాసిన పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే మన ఆంధ్రప్రదేశ్ అని అలాంటి మహనీయునికి జోహార్లు అర్పిస్తూ ఆత్మకూరు బస్టాండ్ వద్ద నున్న ఆయన విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటించి నెల్లూరులో శోభాయాత్ర ప్రారంభించారని వివరించారు. నెల్లూరుకు గొప్ప చరిత్ర ఉందని దేశంలోనే నెల్లూరు జిల్లా ఒక ప్రత్యేక ప్రాంతమని ఎందుకంటే ఉప రాష్ట్రపతిగా వెంకయ్య నాయుడు, రాష్ట్రపతిగా నీలం సంజీవరెడ్డి ఈ ప్రాంతం నుంచి రావడం మనందరికి గర్వకారణం అని అన్నారు. అంతే కాకుండా బెజవాడ గోపాల్‌రెడ్డి, ఎన్.జనార్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా రాష్ట్రాన్ని, ఏలిన ప్రాంతం నెల్లూరు కావడం అందరికి ఆదర్శం అన్నారు. ఈ జిల్లాలో ఉన్న వామపక్ష నాయకులతోనూ తాను చదువుకునే రోజుల్లో పరిచయాలు ఏర్పరచుకుని వాళ్లతో ఘర్షణ పడిన సందర్భం గుర్తు చేసుకుంటున్నానని అన్నారు. ఈ సందర్భంలో ప్రాణ త్యాగం చేసిన మన పార్టీ నేత రామకృష్ణారెడ్డిని ఆయన త్యాగాన్ని ఎవరు మర్చిపోకూడదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు ప్రతి స్థానంలో పోటీ చేసే విధంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆ ఎన్నికల్లో వార్డు మెంబర్‌గా సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, జడ్పీటీసీగా, కౌన్సిలర్‌గా అనేక మంది గెలిచి పార్టీ యొక్క బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఎన్నికల్లో గెలిచినప్పుడే కార్యకర్తకు గౌరవం దక్కుతుందని ఆ గౌరవమే వేరని అందుకు ప్రతి కార్యకర్త ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల్లో మన వాటా మనకు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు తగిన విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తొలుత భారతీయ జనతా పార్టీలో తెలుగు, సంస్కృతి భాషల చైర్మన్‌గా ఎన్నికైన ఆర్డి విల్సన్ మాట్లాడుతూ భాష అంతరించిపోతున్న దశలో నాకు తెలుగు, సంస్కృతి భాషలను బ్రతికించుకునేందుకు చైర్మన్‌గా నాకు పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. భారతీయ జనతా పార్టీలో దేశం కోసం చావాలనుకునేవారు, దేశం కోసం బతకాలనుకునేవారు కార్యకర్తలుగా ఉంటారని అలాంటి క్రమశిక్షణ గల పార్టీ భారతీయ జనతా పార్టీ అని చెప్పారు. అనంతరం నేతలు, కర్నాటి ఆంజనేయరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వాకాటి నారాయణరెడ్డి, గుండ్లపల్లి భరత్ కుమార్, కందికట్ల రాజేశ్వరి, సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు వంశీధర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దయాకర్‌రెడ్డి, మండ ఈశ్వరయ్య, కాకు విజయ లక్ష్మి, రఘునాథరాజు, గాజుల వెంకయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టపగలు నడి బజార్లో దారుణ హత్య



**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 13, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలో బుధవారం పట్టపగలు నడి బజారులో అందరూ చూస్తుండగా ఒక వ్యక్తిని తరుముకుంటూ వెళ్లి దారుణంగా పొడిచి హత్య చేశారు. పాత కక్షాల నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు స్థానిక సిఏఎం హైస్కూల్ సమీపంలోని కసాయి వీధికి చెందిన షేక్ లైక్ (30) బిర్యానీ వంట మాస్టర్‌గా పనిచేస్తుంటారు. చుట్టుపక్కల వారితో సన్నిహితంగా ఉంటుంటాడు. బుధవారం మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో తన సోదరుడు రఫీ తో కలిసి అలంకార్ సెంటర్లో క్యాటరింగ్ కోసం సరుకులు కొనేందుకు వెళ్లాడు. ఈ సమయంలో నూర్, దావు అనే ఇద్దరు దుండగులు లైక్‌ను అడ్డగించారు. వారి నుంచి తప్పించుకొని పరిగెత్తుకుంటూ వెళ్లిన లైక్‌ను కత్తులతో తరిమి తరిమి నరికి చంపారు. దుండగులకు మృతుడు లైక్‌కు గతంలో గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న సంతపేట సీఐ కోటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని సోదరుడు రఫీ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. పట్టపగలు అందరూ చూస్తుండగా ఈ దారుణమైన సంఘటన చోటు చేసుకోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని సీఐ స్పష్టం చేశారు.

# పేదరికంలేని సమాజాన్ని నిర్మించడమే పి4 లక్ష్యం

**కావలి ఎమ్మెల్యే**




**కావలి, ఆగస్టు13, ప్రభాతవార్త:** పేదరికంలేని సమాజాన్ని నిర్మించడమే పి4లక్ష్యమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. కావలి ఆర్‌డిఒ కార్యాలయంలో బుధవారం పి4 కార్యక్రమంపై ఆర్‌డిఒ వంశీకృష్ణతో కలసి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగ ఎమ్మెల్యే మాట్లాడారు. అట్టడుగునవున్న కుటుంభాలను ఆదుకోవడంకోసం ఈ పి4 కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగ పేదకుంటుంభాలను ఉన్నతస్థాయికి తీసుకెళ్ళాలని లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని ముందుకుతీసుకెళుతున్నారని తెలిపారు. ప్రతిఒక్కరు పేదవర్గాలకు మార్గదర్శకులుగ వ్యవహరించాలని కోరారు. కావలి నియోజకవర్గంలో 9వేల పేదకుటుంభాలను గుర్తించినట్టు తెలిపారు. గాస్‌కనెక్షన్‌లులేని, ఇంకా కట్టెలమీద వంటచేసుకొనే కుటుంభాలు అదికంగ వున్నాయని తెలియజేశారు. ఈకుటుంభాలను బంగారు కుటుంభాలుగ మార్చడమే లక్ష్యంగ ప్రతికుటుంభానికి ఒక మార్గదర్శని ఏర్పాటుచేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈసందర్భంలో 1350మంది పేదకుటుంభాలను దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చారని అన్నారు. దత్తత ప్రక్రియపైవున్న అపోహలను తొలగిస్తు దీనివల్ల ప్రభుత్వాలు లేద బ్యాంకులు ఇబ్బందులు పెట్టవని స్పష్టంచేశారు. మన కుటుంభాలనేకాదు పక్కింటివారినికూడ ఆదుకోవాలని పిలుపు నిచ్చారు. దేవునిసేవకన్నా మానవసేవే గొప్పదని సమాజంలో సేవచేసే వ్యక్తులకు గౌరవం లభిస్తుందని అన్నారు. ఈకార్యక్ర మంద్వార పేదరిక నిర్మూలనలో ప్రభుత్వాలు, ప్రవేటుసంస్థలు, ప్రజలు కలసి పనిచేస్తే సమాజం సంపన్నంగ మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. అధికారులు, మార్గదర్శులు, ప్రజలు, స్వశ్చందసంస్థలు తదితరులు పాల్గొన్నారు.

## కోడూరు బీచ్ రోడ్డుకు మోక్షంపై హర్షం



**నెల్లూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త-వైద్యం :** సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కలిసి ధన్యవాదములు తెలియజేసిన కోడూరు వేళాంగిణి చర్చి ప్రతినిధులు. గుంతలమయంగా మారిన రోడ్డుతో చర్చికి వచ్చే భక్తులతో పాటు పర్యాటకులకు అనేక ఏళ్లుగా ఇబ్బందుల. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోడూరు బీచ్ రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టిన సోమిరెడ్డి. రోడ్డు నిర్మాణానికి రూ.3.85 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.

## నెల్లూరు సిటీలో వైఎస్సార్‌సిపి పట్ల యువతలో ఉత్సాహం ఉరకలు

**- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి నాయకత్వంలో ముందుకు వస్తున్న యువ శక్తి**



**నెల్లూరు రూరల్, ఆగస్టు 13, ప్రభాతవార్త :** నెల్లూరు రాంజీ నగర్ సిటీ ఆఫీస్‌లో భారీగా చేరికలు జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు మద్దతుగా యువత ఏకమవుతున్నారు. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా యువత గళం విప్పింది. సిటీ ఇన్‌ఛార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో పనిచేయడానికి భారీగా ఆసక్తి చూపుతూ, ప్రతిరోజూ స్వచ్ఛందంగా పార్టీకి చేరిక అవుతున్నారు. మంగళవారం నెల్లూరు రాంజీ నగర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సిటీ ఆఫీస్‌లో, యువ నాయకుడు వంశీ ఆధ్వర్యంలో పలువురు యువత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి సంక్షేమాభివృద్ధి పాలనను ప్రజలు మరోసారి కోరుకుంటున్నారు. ఆ దిశగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం అన్నారు. నెల్లూరు సిటీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలపరచి, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి తీసుకురావడం మా లక్ష్యం అని యువత ధృడ సంకల్పం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ పట్ల ఆకర్షితులై చేరుతున్న యువతకు సముచిత ప్రాధాన్యం ఇస్తాం. అభివృద్ధి, సంక్షేమమే మా రాజకీయ పునాదిఅని పేర్కొన్నారు.

## బిజెపి జిల్లా అధ్యక్షుడ్ని కలిసేందుకు తరలిన రూరల్‌నేతలు



**బుచ్చి ఆగష్టు 13 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాదవ్ నెల్లూరు వస్తున్న తరుణంలో బుచ్చిరెడ్డిపాళెం రూరల్ నుండి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. రూరల్ మండల అధ్యక్షులు సిద్దన మనోహర్‌రెడ్డి మరియు పార్టీ సీనియర్ నాయకులు వాహనాలలో నెల్లూరు తరలి వెళ్లారు. రాష్ట్ర అధ్యక్షుడ్ని కలిసిన తరువాత బిజెపి జిల్లా అధ్యక్షులు శీపారెడ్డి,వంశీదర్‌రెడ్డి, ఆధ్వర్యంలో కస్తూరిదేవి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన బిజెపి విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో కూడా పాల్గోనన్నుట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

## వర్షపు నీరు రోడ్లపై చేరకుండా అన్ని జాగ్రత్తలు వహించండి

**- కమిషనర్ వై.ఓ నందన్**



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 13 , ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో లోతట్టు ప్రాంతపు డివిజన్లలో వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని, రోడ్లపై వర్షపు నీరు చేరకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని కమిషనర్ వై.ఓ నందన్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ బుధవారం స్థానిక ఎన్టీఆర్ నగర్, బాలాజీ నగర్, ఏసీ నగర్, ఆత్మకూరు బస్టాండ్ సమీపంలోని అండర్ బ్రిడ్జి, విజయ్ మహల్ గేటు బాక్స్ టైపు బ్రిడ్జి తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో డ్రైను కాలువలను మూసివేస్తూ చేపట్టిన నిర్మాణాలను గుర్తించిన కమిషనర్, వెంటనే వాటిని తొలగించి పూడికతీతకు అడ్డంకి లేకుండా చూడాలని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. అన్ని డివిజన్లలో డ్రైను కాలువలపై అక్రమంగా నిర్మించిన ర్యాంపులు, మెట్లు, ఇతర నిర్మాణాలను గుర్తించి వాటిని యజమానులే స్వచ్ఛందంగా తొలగించుకునేలా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. స్థానికంగా వీధి వ్యాపారాలు నిర్వహిస్తున్న హోటళ్ల నిర్వాహకులు బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలను వేయకుండా ప్రణాళిక బద్ధంగా డస్ట్ బిన్లను ఏర్పాటు చేసుకొని, చెత్త తరలింపు వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని కమిషనర్ వారికి సూచించారు. అనంతరం స్థానిక ఏసీ నగర్ ప్రాంతంలో ఆధునికీకరణ జరుగుతున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులను కమిషనర్ పర్యవేక్షించారు. నిర్దేశించిన సమయంలోపు పనులను పూర్తి చేసి తాగునీటి ట్యాంకు ద్వారా స్వచ్ఛమైన నీరు ప్రజలకు సరఫరా చేసేలా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి, విజయ మహల్ గేట్ బాక్స్ టైపు బ్రిడ్జి, రామలింగాపురం అండర్ బ్రిడ్జి, మాగుంట లేఔట్ అండర్ బ్రిడ్జి ప్రాంతాలలో వర్షపు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు మోటార్ల సాయంతో నీటిని తోడివేయాలని కమిషనర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 13వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి, నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనిల్ కుమార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రైళ్లలో చోరీలకు పాల్పడే నిందితుడు అరెస్ట్

**- రూ. 12 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం**



**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 13, ప్రభాతవార్త :** రైళ్లలో తరచూ దొంగతనాలకు పాల్పడే నిందితుడిని నెల్లూరు రైల్వే పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుండి 123 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు లాప టాప్‌లు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను రైల్వే డిఎస్పి మురళీకృష్ణ వెల్లడించారు. హైదరాబాద్‌లోని చంద్రాయన గుట్ట సిఆర్పిఎఫ్ వాట్సాప్‌కు చెందిన సిఆర్పిఎఫ్ క్వార్టర్స్‌కు చెందిన కట్టమంచి గోవర్ధన్ అలియాస్ కార్తీక్ (39) రైళ్లలో చోరీలు చేస్తూ పలుమార్లు జైలుకి వెళ్లి రావడం జరిగింది. వికలాంగుల భోగిలో ఎక్కి అందరూ ఆదమరిచాక ఏసి బోగిలోకి మారి నిద్రిస్తున్న వారి బ్యాగుల్లోని ఆభరణాలు ఇతర వస్తువులను చోరీ చేసేవాడు. ఈ క్రమంలో నెల్లూరు జిఆర్పి సీఐ సుధాకర్, గూడూరు ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ హజారిలాల్, నెల్లూరు ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ రమేష్ గౌడ్‌లు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపడుతుండగా శతాబ్ది ఎక్స్‌ప్రెస్ నుండి దిగిన నిందితుడు అనుమానాస్పదంగా తిరుగుతూ స్టేషన్ ఉత్తరం వైపు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న క్రమంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు వద్ద నుండి సుమారు రూ. 12 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన జిఆర్‌పి సుధాకర్‌తో పాటు రైల్వే ఎస్సై హరి చందన, పీసీలు దయాకర్, మణికంఠ, కిరణ్‌లను డి.ఎస్.పి అభినందించారు.

## శ్రీగోపాలకృష్ణయ్యస్కూల్‌లో హరే ఘర్ తిరంగా కార్యక్రమం



**బుచ్చి ఆగష్టు 13 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో హరేఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.జాతీయ జెండాను నెల్లూరు ఎప్ఎసి అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రంతుల్లాబాషా జాతీయ జెండాను పాఠశాలపై ఎగరవేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్ మాట్లాడుతు ప్రతి ఇంటిపైన మన జాతీయ పతాకాన్ని ఎగరవేయాలని తెలియజేశారు. ఈక ార్యక్రమంలో హిందీ పండిట్ అమీర్, విద్యార్థులు పాల్గోన్నారు.

## అల్ప పీడనం ప్రభావం - మండలంలో చిరుజల్లులు



**బుచ్చి ఆగష్టు13 ప్రభాతవార్త :** బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో మండలంలో చిరు చిల్లులు కురుస్తున్నాయి. అల్ప పీడన ప్రభావంతో రాబోయే ఆరు రోజులు రాష్ట్రంలో పలు ప్రాంతాలలో భారీ వర్షాలు పడవచ్చునని వాతావరణ శాఖ హెచ్చరిస్తుంది. ఆగష్టు 13,14,15,16 తేదిలలో భారీ నుండిఅతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈనెల 18న మరో అల్ప పీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతారణ శాఖ నిపుణులు అంచనాలు వేస్తున్నారు. గత రెండు రోజుల నుండి మండలంలో చలిగాలలు,చిరు జల్లులు కురుస్తున్నాయి.ఈ వర్షాల వల్ల వెన్ను తీసిన వరిపైరు పడిపోతుందని రైతులు ఆందోలన చెందుతున్నారు.

## నెల్లూరుకు తరలిన బిజెపి శ్రేణులు



**అల్లూరు,ఆగస్టు 13,ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ నెల్లూరుకు విచ్చేస్తున్న సందర్భంగా బుధవారం అల్లూరు మండల బిజెపి నాయకులు చెంతాటి కృష్ణమోహన్. కత్తుల కిరణ్ నాయుడు. దేవళ్ళ హరిప్రసాద్ రెడ్డి,తాళ్లూరు నవీన్ కుమార్,మల్లికార్జున్ సింగ్. ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లి సారథ్యం ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడును మర్యాదపూర్వకంగా కలిశారు.

## 30 యాక్ట్ రద్దు చేయాలి, భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలి

**ఉలవపాడు, ఆగష్టు 13, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ఇండోసోల్ కంపెనీకి దళారీగా మారిచేస్తున్న బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాన్ని అణచి వేసేందుకు అమలు చేస్తున్న 30 యాక్ట్‌ను రద్దు చేయాలని, ప్రజలను మభ్యపెట్టి చేస్తున్న భయపెట్టి చేస్తున్న బలవంతపు భూసేకరణను ఆపివేయాలని, భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసి జిల్లా నాయకులు ఆర్ మోహన్, అఖిల భారత రైతు కూలి సంఘం రాష్ట్ర నాయకులు కే.నాంచార్లు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల అభిప్రాయానికి విలువ ఇవ్వాలి కాని కూటమి ప్రభుత్వం జులై 4వ తేదీ నిర్వహించిన గ్రామ సభలో కరేడు గ్రామ ప్రజలు స్పష్టంగా ఇండోసోల్ కంపెనీకి మూడు పంటలు పండే పంట భూములు ఇవ్వమని చెప్పారు. జులై 30న ఉలవపాడులో నిర్వహించిన ప్రజా సదస్సులో కూడా రైతులు తమ భూములు ఇవ్వమని చెప్పారు. ప్రజలు అభిప్రాయాలను గౌరవించకుండా కొంత మంది దళారులు ద్వారా ప్రజలు, రైతులను మభ్యపెట్టి భూములు తీసుకునేందుకు కుట్ర పూరితంగా వ్యవహారిస్తోందని ఆరోపించారు. రామకృష్ణాపురం, ఉప్పెరపాలెం, పోట్టేనుగుంటలలో ప్రజలకు సర్వే ఎందుకు చేస్తున్నామో చెప్పకుండా పోలీసుల ద్వారా భయపెట్టే ఇంటింటి సర్వే చేశారు. ప్రజలను, రైతులను భయపెట్టే భూసేకరణ చేస్తే అనివార్యంగా ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సి వస్తోందని కామ్రేడ్ ఆర్.మోహన్, కే.నాంచార్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## అల్పపీడనం తో వేరుశెనగ రైతులలో ఆందోళన

**బిట్రగుంట ఆగష్టు 13 ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం వల్ల విస్తరంగా, భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో వేరుశెనగ రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వరి రెండో పంట సాగుచేసిన రైతులు కూడా ఆందోళన కు గురివుతున్నారు. ఇదిలా ఉండగా బుధవారం నుండి వాతావరణం పూర్తిగా మారిపోయింది. మత్యకారులు చేపలవేటకు వెళ్ళవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

## తోటపల్లి గూడూరు, పేడూరు పీఏసీఎస్ అధ్యక్షులుగా సన్నారెడ్డి సురేష్ రెడ్డి, గూడూరు నారాయణ..

**డైరెక్టర్లుగా నియమితులైన దేవరాల ప్రవీణ్, మేనాటి శీనయ్య, జానా శ్రీనివాసులు, మూగా రాజా**

**అల్లీపురంలోని నివాసంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో చైర్మన్లు, డైరెక్టర్ల మర్యాద పూర్వక భేటీ**



**తోటపల్లి గూడూరు ఆగష్టు 13, ప్రభాతవార్త :** నూతన పాలకవర్గాలను అభినందించిన సోమిరెడ్డి...రైతుల కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపు.తమకు చైర్మన్లు, డైరెక్టర్లుగా అవకాశం కల్పించినందుకు సోమిరెడ్డికి సత్కారం చేసి ధన్యవాదములు తెలియజేసిన నూతన చైర్మన్లు, డైరెక్టర్లు.కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, జాఫర్ సాహెబ్ కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, మండల అధ్యక్షుడు కొణతం రఘుబాబు తదితరులు..



## రేపటి నుండి రాపూరు గ్రామ దేవత రాపూరమ్మ కొలుపు



**రాపూరు,ఆగష్టు13ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరు గ్రామ దేవత శ్రీ రాపూరమ్మ తల్లి కోలుపు(జాతర),కార్యక్రమం శుక్రవారం నుండు నిర్వహించనున్నారు. ఈ సందర్బంగా 15వ తేది ఉదయం అభిషేకాలు,గ్రామ కాపు కట్టుట, మైలు ముగ్గు,సాయంత్రం అమ్మవారికి ఆహ్వానం కార్యక్రమం నిర్వహిస్తారు. 16వ తేది శనివారం ఉదయం పోతురాజు ముగ్గు, పూలాంగి సేవ, మద్యాహ్నం అన్నదానం, సాయంత్రం గంగ పెట్టే ఊరేగింపు నిర్వహిస్తారు. 17వ తేది ఆదివారం ఉదయం గ్రామపొంగళ్ళు, అమ్మవారి ముగ్గు, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని రంగు,రంగు విద్యుత్ దీపాలతో అలంకారం నిర్వహించారు.

## బిట్రగుంట లో నిరూపయోగంగా ఉన్న ఆస్తులు సద్వినియోగం చేసుకోవాలి



**బిట్రగుంట ఆగష్టు 13 ప్రభాతవార్త:** దక్షిణ మధ్యరైల్వే లోని విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో బిట్రగుంట లో ఉన్న వందలాది ఎకరాల రైల్వే ఆస్తులను సద్వినియోగంలోకి తీసుకోనివచ్చి ఏదైనా యూనిట్ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవన్ కు బీజేపీ నేతలు నూకసాని శ్రీనివాసులు, గోవిందరావులు విజ్ఞప్తి చేశారు. జిల్లా పార్టీ సమావేశానికి బుధవారం విచ్చేసిన ఆయనకు ఇక్కడ ఉన్న నిరూపయోగ ఆస్తులు ఏ విదంగా సద్వినియోగం చేసుకోవాలో ఎటువంటి యూనిట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతానికి పూర్వ వైభవం వస్తుందో విజ్ఞాపన పత్రంలో అయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపైన కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్తామని వారికి హామీ ఇచ్చారు.

## కండలేరులో 26.80 టీయంసీల నీటిమట్టం

**కండలేరుడ్యాం (రాపూరు), ఆగష్టు 13 ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో బుదవారం ఉదయం నాటికి జలాశయంలో 26.80 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ అనీల్ కుమార్ తెలిపారు. సోమశిల కండలేరు వరద కాలువ ద్వారా జలాశయంలోకి 5900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వుండగా ,జలాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 1895 క్యూసెక్కులు, లో లేవల్ స్ల్యూయిస్ ద్వారా 40 క్యూసెక్కులు,హైలెవల్ కెనాల్ లిఫ్టింట్‌గ్‌కి 100 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2045 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## జిల్లాలో స్త్రీ శక్తి పథకం అమలుకు సర్వం సిద్ధం




**నెల్లూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పేరుతో ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి జిల్లాలో సర్వం సిద్ధమైంది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరిం చుకుని ఆగస్టు 15న శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని విజయవాడ నుంచి సీఎం చంద్రబాబు నాయుడు లాంఛనంగా ప్రారంభిం చనుండగా, జిల్లావ్యాప్తంగా అన్ని డిపోల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవ కార్యక్ర మాల్లో పాల్గొనేలా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని 7 ఆర్టీసీ డిపోల్లో మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి 492 బస్సులను కేటాయిస్తూ ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఆధార్‌కార్డు, ఓటరుకార్డు మరి ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి రాష్ట్రంలో ఎక్కడినుండి ఎక్కడికైనా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. ఆర్టీసీ బస్సులతో పాటు అద్దెబస్సులను కూడా ఏర్పాటుచేశారు. జిల్లాలోని ఆత్మకూరు డిపో పరిధిలో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కలిపి 61 బస్సులు, కందుకూరు డిపో పరిధిలో 60, కావలిలో 90, నెల్లూరు!!1 డిపో పరిధిలో 91, నెల్లూరు!!2 డిపో పరిధిలో 90, రాపూరు డిపో పరిధిలో 49, ఉదయగిరి డిపో పరిధిలో 51 బస్సులను మహిళల ప్రయాణానికి సిద్ధం చేశారు. మొత్తం 492 బస్సులను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మహిళల ఉచిత ప్రయాణానికి సిద్ధం చేసినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి షామీమ్ తెలిపారు. ఈ బస్సుల్లో చార్జీ రాయితీ మొత్తం చూపిస్తూ జీరో ఫేర్ టిక్కెట్లను జారీ చేసేలా ఆర్టీసీ ఏర్పాట్లు చేసినట్లు ఆమె చెప్పారు. బస్సుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. సిబ్బంది, ప్రయాణికుల మధ్య పరస్పర దాడులు జరగకుండా ముందస్తు చర్యలకు ఉపక్రమించింది. బస్సుల్లో నిఘా, పర్యవేక్షణ కోసం సీసీ కెమెరాలు, కండక్టర్లకు బాడీ ఓర్న్ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.

**నెల్లూరులో ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించనున్న మంత్రి నారాయణ..**

మహిళలకు ఉచిత పథకాన్ని నెల్లూరు ప్రధాన బస్ స్టేషన్‌లో ఆగస్ట్ 15వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఏ.పి.యస్.ఆర్.టి.సి. నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి సమక్షంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి షామీమ్ తెలిపారు. అన్ని డిపోల్లో స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

## హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో విపిఆర్ దంపతులు



**నెల్లూరు రూరల్, ఆగస్టు 13, ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హర్ ఘర్ తిరంగాకు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు భాగస్వాములు అయ్యారు. నెల్లూరు నగరంలోని విపిఆర్ నివాసంపై జాతీయ జెండాను ఏర్పాటు చేయించి హర్ ఘర్ తిరంగాకు తమవంతు సంఘీభావం తెలిపారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు జెండా రెపరెపలాడనుంది. భారత ప్రభుత్వం హర్‌ఘర్ తిరంగా 2025 ద్వారా ప్రజల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడం, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయడం ద్వారా ఐక్యతను, దేశభక్తిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. జాతీయ జెండా కేవలం ఒక చిహ్నం మాత్రమే కాదు, మన సమష్టి ఐక్యతకు నిదర్శనం. ఈ నేపథ్యంలో హర్ ఘర్ తిరంగ ద్వారా ప్రతి పౌరుడిలో దేశభక్తిని రగిలించడానికి, తమవంతుగా జాతీయ జెండాను విపిఆర్ దంపతులు తమ నివాసంపై ఏర్పాటు చేయించి దేశ భక్తి చాటుకున్నారు. ప్రతి ఒక్కరు ఈ ఉద్యమంలో భాగం కావాలని పిలుపునిచ్చారు.

## జిల్లా స్థాయి యు - 17 చెస్ ఛాంపియన్‌లుగా హేమల్ వర్షన్, సంజన




**నెల్లూరు సిటీ, ఆగస్టు 13, ప్రభాతవార్త** జిల్లా చెస్ అసోసియేషన్, రాయ్ చెస్ అ కాడమీ సంయుక్తంగా ఈ నెల12 వ తేది నిర్వహించిన నెల్లూరు జిల్లా స్థాయి అండర్ 17 బాలూరు, బాలికల చెస్ ఛాంపి య న్‌షిప్ పోటీలలో అందాలమాల హేమల్ వర్షన్, భట్టారాం సంజన బాల బాలికల విభాగంలో గెలుపొందారు. జిల్లా నుండి 10 మంది ఫిడే రేటింగ్ క్రీడకారులు పాల్గొన్న ఈ పోటీలలో జి. హిమ తేజస్విని ఓపెన్ విభాగం లో పాల్గొని రెండవ స్థానం సాధించింది. బాలికల విభాగంలో బి. కీర్తన, రెండోవ స్థానం సాధించి ఆగస్ట్ 16, 17 తేదీలలో కాకినాడలో జరుగు రాష్ట్ర స్థాయి జూనియర్ చెస్ ఛాంపియన్‌షిప్‌కు జిల్లా నుండి అధికారకంగా ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులకు ఎన్‌సిఈఆర్‌టి అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మి నరసింహ, బహుమతులు ప్రధానం చేసారు. ఆర్బిటర్ మౌనిక, విష్ణు, బషీర్, పరిశీలకుడు ఫీడే ఇన్సక్టర్ అజీజ్ పోల్గొన్నారు.

## వికసించిన కమలంతో స్వాగతం



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగస్టు 13, ప్రభాతవార్త** నెల్లూరుకు విచ్చేసిన రాష్ట్ర నూతన కమల దళపతి పీవీఎన్ మాధవ్‌కు బీజేపీ నేత మిడతల రమేష్ వికసించిన కమలం పుష్పాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కమలం స్వీకరించిన మాధవ్ వికసించిన కమలంలాగే పార్టీని జిల్లాలో బలోపే తం చేయాలని రమేష్ ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడితో చెప్పారు.

## రాష్ట్రం లోని 26 జిల్లాల ఇన్స్పెక్టర్ ఆడిటర్ ఆఫ్ వక్ఫ్ లతో అబ్దుల్ అజీజ్ రివ్యూ



**నెల్లూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త-వైద్యం** : ఇప్పటికే అనేక ఎకరాల ఆక్రమిత భూమిని వెనక్కి తీసుకొచ్చాం.కనీసం 50 శాతం ఆక్రమిత భూ మిని వెనక్కి తీసుకురావాలి.ప్రతిభ కనపరిచిన అధికారులను గౌరవించి సత్కరిస్తాం. షేక్‌అబుల్‌అజీజ్, ఏపీ వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్, నెల్లూరు పార్లమెం ట్ టీడీపీ అధ్యక్షులు. ఏపీ వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, ఆంధ్ర రాష్ట్రంలోని 26 జిల్లాల ఇన్స్పెక్టర్ ఆడిటర్ ఆఫ్‌వక్ఫ్, జోనల్ అధికారులుగా నియమించిన సూపరింటెండెంట్ లతో నెల్లూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో రివ్యూ నిర్వహించారు. వక్ఫ్‌ఆస్తుల సంరక్షణ, ముస్లిం సమాజ సంక్షేమం, ఆదాయ వృద్ధి, ఉత్పత్తి లు అజెండా గా రివ్యూ సమావేశం సాగింది. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మా ట్లాడుతూ, బోర్డు ఏర్పడిన కొంతకాలంలోనే ఆక్రమణకు గురైన అనేక ఎకరాల భూమిని వెనక్కి తీసుకొచ్చా మని, అక్రమణకు గురైన భూమిలో కనీసం 50 శాతం వెనక్కి తీసుకురావాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభావంతమైన పనితీ రును కనపరుస్తున్న పలువురు ఇన్స్పెక్టర్ ఆడిటర్ ఆఫ్‌వక్ఫ్‌లను అభినందించారు. జిల్లాల వారీగా, వక్ఫ్ సం స్థల వారీగా వక్ఫ్ బోర్డుకు రావాల్సి న బకాయిల గురించి చర్చించి,బకాయిలను త్వరితగతిన వసూలు చేయా లని అధికారులను సూచించారు. త్వరలో వక్ఫ్ బోర్డ్ తరఫున మొదలు పెట్టబోతున్న స్కిల్‌డెవలప్మెంట్, విద్యా పథకంపై సుదీర్ఘంగా చర్చించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ప్రతిభ కనబరిచిన అధి కారులను గౌరవించి సత్కరిస్తామని తెలిపారు.

## రెండో పంట ధాన్యం కొనుగోళ్లపై ఎమ్మెల్యే సోమిరెడ్డితో రైతుసంఘాల నాయకుల భేటీ



**నెల్లూరు, ఆగస్టు 13, ప్రభా తవార్త - వైద్యం** 10 రోజుల్లో ఎడగారు పంట కోతలు ప్రా రంభమవుతు న్ననేపథ్యంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిపించాలని వినతి 3 లక్షల ఎకరాల్లో కేఎన్‌ఎం 1638, ఎంటీయూ 1010, కేఎన్‌ఎం 733 రకాల పంటను రైతులు సాగుచేశారని, 7 లక్షల టన్నులకు పైగా దిగుబడి లభిస్తుందని వెల్లడిపంట చేతికొచ్చే సమయం ఆసన్నమైన నేపథ్యంలో ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అలాట్మెంట్ ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరిన రైతు సంఘాల నాయకులురబీ సీజన్ లోనే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో 80 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారని గుర్తుచేసిన రైతు నేతలురైతు సంఘాల నాయకులు తనదృష్టికి తెచ్చిన సమస్యపై వెంటనే స్పందించిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్‌గౌర్ తో ఫోన్‌లో సంభాషణ. నెల్లూరు జిల్లాలో రెండో పంట ధాన్యం కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరిన సోమిరెడ్డి సివిల్ సప్లయిస్ మినిస్టర్ నాదెండ్ల మనోహర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులతోనూ మాట్లాడి తగు చర్యలు చేపట్టాలని కోరుతానని రైతు నాయకులకు హామీ సమావేశంలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు రావూరి రాధాకృష్ణమ నాయు డు, చంద్ర రాజగోపాల్, చిరసాని కోటిరెడ్డి, షేక్ షానవాజ్, ఏవీఆర్ నాయుడు, వై.శ్రీనివాసులు రెడ్డి, పి.జనార్దన్, మాతూరు శ్రీనివాసులు రెడ్డి, జడ వెంకటేశ్వర్లు, పి.అశోక్ కుమార్ రెడ్డి, పి.శంకరకిషోర్ తదితరులు

## సౌరధ్యంసభకు భారీగ తరలివెళ్ళిన బిజెపి నేతలు



**కావలి,ఆగష్టు13,ప్రభాతవార్త:**భారతీయ జనతాపార్టీ కావలి పట్టణశాఖ ఒకటవ పట్టణ అధ్యక్షుడు మందా కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగిన సారధ్యం సభకు కావలి పట్టణం నుండి భారీగా బిజెపి శ్రేణులు తరలివెళ్ళారు .నూతనంగ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవీ భాధ్యతలు చేపట్టిన పివిఎస్ మాధవ్ పర్యటన సందర్భంగ నెల్లూరులో జరిగే బిజెపి శోభాయాత్ర, సారధ్యం సభకు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో జల్లా టెలికం అడ్వజరి కమిటి సభ్యు లు కుట్టుబోయిన బ్రహ్మానందం,జిఎస్‌టి కౌన్సిల్ సభ్యుడు అమరా వెంకటసు బ్బా రావు పట్టణప్రధాన కార్యదర్శి గుడిపల్లి ప్రసన్నకుమార్,ఉపాధ్యక్షుడు కోదూరు మురళీకృష్ణ,దేవెళ్ళ రాకేష్ ,ఇన్నమూరి సుబ్రహ్మ ణ్యం, పసుపులేటి సుధాకర్,వల్లెపు తిరుపతయ్య,కామినేని ఉదయ్‌లక్ష్మి,నెల్లూరు సుభాష్,తువ్వల శ్రీని వాసులు,షేక్ మస్తాన్,బిజెపి కార్యకర్తలు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివెళ్ళారు.

## చదివిన స్కూల్‌ని పుట్టిన ఊరుని పి4 ద్వారా అభివృద్ధి చేసుకునే అవకాశం: నుడా ఛైర్మన్ కోటంరెడ్డి

- దేశ విదేశాల్లో ఉన్న తన స్నేహితులని పి4 లో భాగస్వామ్యులను చేస్తానన్న కోటంరెడ్డి
- మల్లెల సంజీవయ్య మున్సిపల్ హైస్కూలుని తన సతీమణి కోటంరెడ్డి సంధ్య దత్తత తీసుకుందని వెల్లడి
- మల్లెల సంజీవయ్య స్కూల్లో 11 లక్షల తో అభివృద్ధి పనులు.. త్వరలో మరో 50 లక్షలతో మౌళికవసతులు



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 13,ప్రభాతవార్త:** చదివిన స్కూలు ని పుట్టిన ఊరుని పి4 ద్వారా అభివృద్ధి చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పిస్తోందని నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.బుధవారం నుడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబం మార్గదర్శి ద్వారా పేద ప్రజల జీవితాలలో మార్పు తీసుకురావాలనే సీఎం చంద్రబాబు ఆకాంక్ష అన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 లక్షల బంగారు కుటుంబాలను ప్రభుత్వం గుర్తించింది అన్నారు. 2047 కల్లా ఏపీలో పేదరికం నిర్మూలించి అందరికీ అభివృద్ధి చెందే అవకాశం కల్పించడం కోసం సీఎం చంద్రబాబు పి4 ను అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు. తన సతీమణి కోటంరెడ్డి సంధ్య మల్లెల సంజీవయ్య హైస్కూల్ ను దత్తత తీసుకున్నారని తెలిపారు. దేశ విదేశాల్లో స్థిరపడ్డ నెల్లూరియులు పి4 లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్కూల్ దత్తత తీసుకునేందుకు తన స్నేహితులు చాలా మంది సిద్ధంగా ఉన్నారని వారిని కూడా పి4 లో భాగస్వామ్యులను చేస్తానని కోటంరెడ్డి స్పష్టం చేశారు. ఏసీ నగర్లోని మల్లెల సంజీవయ్య ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం 11 లక్షలతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని త్వరలో మరో 50 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు కలలు కంటున్నా స్వర్ణాంధ్ర కోసం అందరూ నడుంబిగించాలన్నారు. ఐలవ్ నెల్లూరు అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. గంజాయి బారిన పడ్డ యువతకు కౌన్సి లింగ్ ఇచ్చి.సరైన మార్గంలో నడిపించేందుకు నుడా ఆధ్వర్యంలో కౌన్సి లింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మీడియా సమావేశంలో నుడా సెక్రటరీ పెంచల్ రెడ్డి ఉన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలి




**కోవూరు , ఆగస్టు 13 ప్రభాతవార్త :** కోవూరులోని పడుగుపాడులో ఉన్న ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ ఎదుట బుధవారం ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జోనల్ నాన్‌ఆపరేషన్ కార్యదర్శి ఎం. ఎలయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఆర్టీసీలో ఉన్న 8 వేల ఖాళీలను డైరెక్ట్ రెక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలన్నారు. గ్యారేజీలో ఉద్యోగులకు సంబంధించి అనేక సమస్యలు ఉన్నాయని, వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈవోఎల్‌ను మంజూరు చేయాలన్నారు. అనారోగ్య కారణాలతో బాధ పడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలన్నారు. తక్షణమే పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్‌చేశారు. అధ్యక్షులు ఎస్‌డీ సాజుద్దీన్, జెడ్ డబ్ల్యూఎస్ కార్యదర్శి కె. సుధాకర్‌రావు, అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, టిఆర్‌ఎస్ కార్యదర్శి ఆర్‌వీ భాస్కర్ రావు, అధ్యక్షులు కేఎస్‌రావు, స్టోర్స్ కార్యదర్శి వి. దయాకర్, అధ్యక్షులు పి. బ్రహ్మయ్య, ఉన్నారు.

## పచ్చిపాల రామనాథమ్మ అకాడమి సేవలు స్ఫూర్తిదాయకం



**కోవూరు , ఆగస్టు 13 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినుల కొరకు 12 లక్షల వ్యయంతో మరుగు దొడ్లు నిర్మాణ పనులు చేపట్టిన పచ్చిపాల రామనాథమ్మ అకాడమి ఇతరులకు స్ఫూర్తిదాయకమని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. స్థానిక పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన వాటిని బుధవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి మాట్లాడుతూ అకాడమి నిర్వాహకులు ప్రత్యేకంగా చొరవ తీసుకుని విద్యార్థుల కొరకు 12 లక్షల వ్యయంతో వీటి నిర్మాణం చేపట్టడం అభినందనీయమని, ఇందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. విద్యార్థులు కూడా దాతలు ఇచ్చిన ఈ సదుపాయాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఝాన్సీరాణి, గీతామాధురి, పలు సూచనలు చేశారు. అనంతరం పతాక వేదికను నిర్వాహకులు ప్రారంభించారు. అదేవిధంగా 1.50 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రహరీ గోడ తదితర పనులు కూడా ఈ సందర్భంగా ప్రారంభించారు.

### ట్రస్టు కార్యదర్శికి ఘన సన్మానం



స్థానిక పాఠశాల సమావేశ మందిరం లో పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ అకాడమి ప్రధాన కార్య దర్శి డాక్టర్ పచ్చిపాల మల్లికార్జునరెడ్డిని పాఠశాల యాజమాన్యం శాలువా,పూలమాలతో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ మరుగుదొడ్ల నిర్మాణాల్లో ఎక్కడా కూడా రాజీ లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించి అతి తక్కువ రోజుల్లోనే వీటిని పూర్తి చేసిన ప్రధాన కార్య దర్శిని సన్మానించుకోవడం తమ అదృ ష్టంగా భావిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి ఈ సందర్భంగా తెలియజేశారు. అదేవిధంగా ఎంపీడీవో శ్రీహరిరెడ్డిని కూడా ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు.

## ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ.. ఇబ్బందుల్లో ప్రజలు



**కోవూరు , ఆగస్టు 13 ప్రభాతవార్త :** వేగూరు గ్రామ పంచాయతీ మజారా సుబ్బారెడ్డిపురం దగ్గర ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు దానిని పగలగొట్టి అందులో ఉన్న రాగి వైరును అపహరించుకుపోయారు. ఈ మేరకు బుధవారం సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఈ మేరకు కోవూరు పోలీస్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ చోరీ విషయమై ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ చోరీ అయిన నేపథ్యంలో సుబ్బారెడ్డిపురం ప్రజలు మంచినీటికి తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు.

## ఎట్టకేలకు విధేయతకు పట్టం



కోవూరు , ఆగస్టు 13 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం వివిధ కార్పొరేషన్లకు ప్రభుత్వం చైర్మన్లను ప్రకటించిన విషయం విధితమే. ప్రకటించిన ఈ నామినేటెడ్ పదవుల్లో నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డికి కీలక పదవి లభించింది. ఆయనను ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ కనీస వేతన సలహా బోర్డు ఛైర్మన్‌గా ఎంపిక చేశారు. మొదటి నుంచి ఆయన తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ 2014లో కోవూరు అసెంబ్లీ టికెట్‌కు తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే ఆ సమయంలో పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి టీడీపీ అధిష్టానం టికెట్ కేటాయించింది. 2024 ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పరిశీలకులుగా ఆయనకు ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. గత దశాబ్దాల కాలం పైగా తెలుగుదేశం పార్టీలో ఉంటూ పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేస్తూ పార్టీ పెద్దల దృష్టిలో ఉన్నారు. ఈ మేరకు మంగళవారం ప్రకటించిన ఛైర్మన్ పోస్టుల్లో ఆయనకు ఈ పదవి రావడం పట్ల ఆయన అనుచర వర్గం పెద్ద ఎత్తున సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఎట్టకేలకు దుంపల కాలువకు మోక్షం




**కోవూరు , ఆగస్టు 13 ప్రభాతవార్త** : కోవూరులోని ప్రధాన చెరువు నుంచి ప్రవహిస్తున్న దుంపల కాలువ ఇటీవల కాలంలో ప్లాస్టిక్ , ఇతర వ్యర్థాలతో నిండిపోయి మురు గునీటి పారుదలకు ఆటంకంగా నిలిచింది. ఈ మేరకు 'ప్లాస్టిక్ చెత్తతో నిండిన కాలువ.. నీరు పారేదెలా' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు స్పందించారు.ఈ మేరకు ఆ దుంపల కాలువలో ఉన్న చెత్తా చెదారాలను జేసీబీతో తరలించేలా చర్యలు చేపట్టారు. దీంతో ఆ ప్రాంతీయులు సంతోషం వ్యక్తం చేశారు.

## బిజెపి అధ్యక్షుడుకి స్వాగతం చెప్పిన బుచ్చి నాయకులు



**బుచ్చి ఆగష్టు13 ప్రభాతవార్త** బిజెపి రాష్ట్ర నూతన అధ్యక్షులు పి.వి.ఎన్ మాదవ్‌కి స్వాగతం చెప్పేందుకు బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ నుండి బిజెపి నాయకులు పెద్దఎత్తున తరలి వెళ్లారు. అర్బన్ అధ్యక్షులు రామిశెట్టి కళ్యాణ్,బిజెపి జిల్లా అధ్యక్షులు కాసా శ్రీనివాసులు, బిజెపినాయకులు గోలి సురేంద్ర, పలువురు బిజెపినాయకులు,మహిళా నాయకులు పెద్దఎత్తున నెల్లూరుకి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు శాలువా కప్పి ,శుభాకాంక్షలు తెలిపారు.

## చేజర్ల నుండి నెల్లూరుకి తరలిన బిజెపి నాయకులు



**చేజర్ల ఆగష్టు 13 ప్రభాతవార్త** బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి.వి.ఎన్ మాదవ్ అధికార బాద్యతలు చేపట్టిన అనంతరం మొట్టమొదటగా నెలూరుకి విచ్చేయడంతో చేజర్ల మండలం నుండి బిజెపి నాయకులు నెల్లూరుకి తరలి వెళ్లారు.ఈ సందర్భంగా పి.వి.ఎన్ మాదవ్‌ని బిజెపి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాలు,మెమొంటోలు అందజేశారు. చేజర్ల మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు. పరిష్కరించేందుకే కృషి చేస్తానని హామి ఇచ్చారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని కూటమి నాయకత్వంలో పనిచేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో బిజెపి మండల నాయకులు కుంకు బాలయ్యనాయుడు, బత్తల కృష్ణయ్య, గుండాల విజయ్‌బాస్కర్‌రెడ్డి, తెల్లపాటి రామానాయుడు, ఆముదం యానాదిరెడ్డి, వియంసి జగ్గారెడ్డి, ఒర్సు పెంచలయ్య, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్ సీటు ఎక్కడ..?

- ముస్లిం జనాభా కు సరిపడా స్మశాన సౌలభ్యం కల్పించండి
- డిఆర్‌ఓ హుస్సేన్ సాహెబ్‌కు ఐయూఎంఎల్ పార్టీ వినతి



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 13, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్స్పెక్టర్, ఆడిటర్‌కు ఒక ప్రత్యేకగదిని కార్యాలయంగా కేటాయిస్తూ కార్యాలయ పనివేళల్లో సమాచారం, పని నిమిత్తం వచ్చిన వారికి అందుబాటులో ఉండునట్లుగా ఒక బాధ్యుని ఖచ్చితంగా, నియమించాలని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ రాష్ట్ర మీడియా కార్యదర్శి మహమ్మద్. హసన్ బేగ్, బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ హుస్సేన్ సాహెబ్‌కు వినతి పత్రం అందిం చారు. ప్రస్తుతం నెల్లూరుజిల్లా వాక్ఫబోర్డ్ ఇన్స్పెక్టర్ నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఈ ఇన్స్పెక్టర్ కం ఆడిటర్‌ను కలవడాని ఆఫీసుకు వచ్చిన వారికి, అతను గాని, అతని తరుపున సహాయకులు గాని, ప్రజలకు సకాలంలో అందుబాటులో ఉండడం లేదు అని అలాగే అతని ఫోన్ నెంబర్ ఉన్నవారు ఫోన్ చేసినప్పటికీ అతను సకా లంలో స్పందించడం లేదు అని అతని ఫోన్ నెంబర్ లేనివారికి కలెక్టర్ వారి కార్యాలయంలో. అవసరం నిమిత్తం వచ్చిన వారికి అతని ఫోన్ నెంబర్‌ను తెలుపువారు లేరు కాబట్టి. అలాగే అతనికి ప్రస్తుతం కేటాయించి ఉన్న సీటు వద్ద ఇది వక్ఫ్బోర్డుకు సంబంధించినది అని, తెలుపు ఎటువంటి గుర్తులు, గాని బోర్డులు గాని లేవు జిల్లా కలెక్టర్ వారు జిల్లాలో వేలకోట్ల రూపాయల, జిల్లాలోని కొన్ని వందల మసీదులు, దర్గాలు తదితర వాటికి సంబందించిన వక్ఫ్ రికార్డులు మెయిన్ టైన్ చేస్తూ, వేలకోట్ల రూపాయల ఆస్తుల రికార్డులను పరిరక్షించవలసిన జిల్లా ఇన్స్పెక్టర్ ఆడిటర్‌కు గల తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించుట కొరకు, జిల్లా వ్యాప్తంగా సమాచారం కొరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంకు వచ్చు ప్రజల అవసరం తీర్చుట కొరకు, అతనికి ఒక ప్రత్యేకమైన గదిని కార్యాలయ నిర్వహణ కొరకు అతను క్యాంపుల పేరుతో జిల్లా మొత్తం తిరుగుతూ జిల్లా కేంద్రకార్యాలయంలో ప్రజలకు సకాలంలో అందుబాటులో లేకుండా పోతున్నందున వచ్చిన ప్రజలకు సకాలంలో కార్యాలయంలో అడిగిన సమాచారం ఇచ్చుట కొరకు కార్యాలయంలో పూర్తి సమయం ఉండునట్లుగా, ఒక ఉద్యోగిని నియమించవలసినదిగాను, తద్వారా ప్రజలకు అవసరమైన వేళల్లో తక్షణం సమాచారం అందించినట్లుగా, కార్యరూ. ముస్లిం జనాభా కు సరిపడా స్మశాన సౌలభ్యం కలిగించండి నెల్లూరు నగరం పరిధిలోని ముస్లిం జనాభాకు సరిపడా స్మశాన సౌలభ్యం లేనందున స్మశాన స్థలం,ఉంచాలని నెల్లూరు నగరం, నగర నియోజకవర్గ పరిధిలోని 42,43,44, వార్డులు, 48వ వార్డు ఈ ప్రాంతం అంతా సుమారు 90 శాతం ముస్లింలతో కూడుకొని ఉన్నదని గతంలో హాల్తాలిమ్ మసీదు ప్రాంగణంలో ఉన్న స్మశానం ప్రస్తుతం లేదు. అలాగే ఈ ప్రాంతంలో ఉన్న సుమారు పదిమసీదులకు అనుబంధంగా స్మశానం లేదు. అనుబంధ స్మశానం ఉన్న జుమ్మా మసీదు (కలెక్టర్ కార్యాల యంకు ఆనుకొని పడమర వైపుగా ఉంటుంది) ఈ మసీదుకు అనుబంధంగా ఉన్న స్మశానము చాలావరకు అన్యాక్రాంతమై, స్మశాన స్థలం కుచించుకు పోయి ఉన్నది. ఈ మసీదుకు సంబంధించిన చాలా భూమి వక్ఫ్ ప్రాపర్టీగా ఉన్నది. ఇందులో చాలావరకు యాజమాన్య నిర్వహణా లోపంతో ఈమసీదు భూములు అన్యాక్రాంతమైపోయినవి. ఉదాహరణకు ప్రస్తుత కోటమిట్ట ప్రాంత పరిధిలోని కుద్దూస్ నగర్ మొత్తం ఈ మసీదునకు సంబంధించినదే.ఈ మసీదుకు సంబంధించి, పరమేశ్వరి నగర్ ప్రాంతంలో నవబాల అపార్ట్మెంట్ కు పడమర వైపుగా సుమారు 13 ఎకరాల పై చిలుకుభూమి ఈ జుమ్మా మసీదుకు సంబంధించిన వక్ఫ్ భూమి ఉన్నది. నగరంలోనూ, జిల్లాలోనూ అన్యాక్రాంతమై, అక్రమణల పాలైన వందలాది ఎకరాల వక్ఫ్ భూముల లాగే ఈ 13 ఎకరాల భూమిని కూడా, జుమ్మా మసీదు యాజమాన్య నిర్వహణ లోపం వల్ల ఈ భూమిని కూడా ముస్లిం సమాజం కోల్పోయే ప్రమాదం కనిపిస్తుంది. జిల్లా కలెక్టర్ నగర ముస్లిం ప్రజలు స్మశాన స్థలలేమితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా, ప్రత్యేక చొరవను చూపించి, తెలిపిన 13 ఎకరాల భూమి నుంచి కనీస పాటి సుమారు 5 ఎకరాల భూమిని ముస్లింల స్మశానం కొరకు కేటాయించాలని ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ డిఆర్‌ఓకు వినతిపత్రం అందించారు. ఈ ఈ కార్యక్రమంలో మీడియా ఇంచార్జ్ హసన్ బేగ్‌తో పాటు లక్ష్మి, ఇమాముద్దీన్, నిసార్, నాయబ్ రాసుల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు



**నెల్లూరు, ఆగస్టు 13, ప్రభాత వార్త-వైద్యం :** నెల్లూరు నగరంలోని నగర డి ప్యూటీ మేయర్ కార్యాల యంలో బుధవారంనాడు డిప్యూటీ మేయర్ రూ ప్‌కు మార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దార్ల వెంక టేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ గజ మాలతో సత్కరించి అనం తరం కేకును కట్ చేసి నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ గారికి జన్మదిన శుభా కాంక్షలు తెలియజేసిన దార్ల వెంకటేశ్వ ర్లు,వారి మిత్ర బృందం తెలుగుదేశం పార్టీ మైనారిటీ నాయకులు హాజీ ఆధ్వర్యంలో నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ గారికి చిత్రపటాన్ని బహుకరించి అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన హాజీ, సురేష్, కమల్, శీను,వారి మిత్ర బృందం తెలుగుదేశం పార్టీ నాయకులు జమ్మళ్ల వినోద్ ఆధ్వర్యంలో నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ గారి 50 అడుగుల భారీ కటౌట్ ఏర్పాటు చేసి వారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి అనంతరం కేక్ కట్ చేయించి నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జమ్మల వినోద్, జమ్మల కార్తీక్, లోకేష్, విజయ్ మరియు వారి మిత్రబృందం తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్లమూడి చంద్ర అల్లంపాటి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో నగర డిప్యూటీ మేయర్ కుమార్ యాదవ్ గారిని మాలతో సత్కరించి అనంతరం వారి చేత కేక్ కట్ చేయించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వడ్లమూడి చంద్ర, అల్లంపాటి జనార్దన్ రెడ్డి మరియు వారి మిత్ర బృందం. గీతామయి వృద్ధుల ఆశ్రమంలో నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ గారి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించిన హాజీ, అమ్ములా, కాకు హరికృష్ణ, దొంతాలి ప్రసాద్ తదితరులు తెలుగుదేశం పార్టీ నాయకులు పోడమేకల సురేష్ మరియు యాదవ యూత్ ఆధ్వర్యంలో బాలాజీనగర్ లో ఉన్న బాజీతోట ఎంపిపి ఎస్ స్కూలు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి అనంతరం 150 మంది విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేసి నగర డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన పొడమేకల తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపారులంతా ట్రేడ్ లైసెన్సు తీసుకునేలా చర్యలు తీసుకోండి

- హెల్త్ ఆఫీసర్ , టి.పి.ఆర్.ఓ



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 13,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని వ్యా పారాలకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి అని, సచి వాలయాల వారిగా సంబంధిత శానిటేషన్ కార్యదర్శులు నూతన వ్యాపారాలను గుర్తించి వ్యాపారస్తులంతా ట్రేడ్ లైసెన్సులు తీసుకునేలా, క్రమం తప్పకుండా లైసెన్సులను రెన్యువల్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ కనకాద్రి టి.పి.ఆర్.ఓ వాసుబాబు ఆదేశించారు. పబ్లిక్ హెల్త్ విభాగం, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో వారాంతపు సమీక్ష సమావేశాన్ని కా ర్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను క్రమం తప్పకుండా చేపడుతూ, 24 గంటల లోపునే గార్బేజిల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించేసేలా సిబ్బందిని పర్యవేక్షించాలని శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. 24 గంటల్లో గార్బేజిల నుంచి చెత్తను సేకరించే విధంగా ప్రణాళికలు రూపొందించుకుని, ఇంటింటి చెత్త సేకర ణలో తప్పనిసరిగా తడి, పొడి చెత్తను విడిగా సేకరించేలా పారిశుద్ధ్య సిబ్బందిని క్రమం తప్పకుండా పర్య వేక్షించాలని సూచించారు. అన్ని డివిజన్లలో క్రమం తప్పకుండా డ్రైన్ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను చేపట్టాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రతి 14 రోజులకు ఒకసారి ఫాగింగ్ ప్రక్రియను అమలు చేస్తూ, ఆయిల్ బాల్స్ పిచికారి, గంబు జియాచేప పిల్లల పెంపకం తదితర కార్యక్రమాలతో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో వాతావరణంలో చోటు చేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రభలే అవ కాశం అధికంగా ఉంటుందని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి వడగాచిన నీటిని తీసుకోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహనకల్పించాలని సూచించారు.ఈ సమా వేశంలో వెటర్నరీ వైద్యులు డాక్టర్ మదన్మోహన్, మలేరియా విభాగం అధికారి డాక్టర్ జిజియా బాయి, శానిటేషన్ సూ పర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీ లు, సిబ్బంది పాల్గొన్నారు

